# గొప్పవారి సరదాలు

"ఆమెకున్న ఒక్క కష్టమూ తనకి మనిషి కుండవలసిన కనీసపు కష్టాలన్నా లేవే అన్నబాధే!"

ప్రపంచంలో అందరికీ మైసూరుపాక్‌లే యిష్టమైతే, పకోడీ లమ్మేవాడు, తను చేసిన పకోడీలే తిని బతకాలి. వాడికి మైసూరు పాకులుండవు. సరికదా అన్నం కూడా ఉండదు. ఆడా మొగా అంతా టైట్ పాంట్సు, జెర్కిన్సు వేసుకు తిరుగుదామనుకుంటే చీరల కంపెనీవాళ్ళు ఈ చీరలతోనే నెత్తిన చెంగేసుకోవాలి. అందరి రుచులూ, ఒక్కలా వుంటాయా? వుండవు. అందుకే జిహ్వాకో రుచి అన్నారు.

అభిరుచులూ అంతే. ప్రెసిడెంటు జాన్సన్‌కి పికిలిపిట్టల పందే లంటే యిష్టం ఉండొచ్చు. అతనికి పికిలిపిట్టలు దొరక్క పోవచ్చు. టుంకూ అబ్దుల్ రహమాన్‌కి తబలా వాయించాలన్న వాంఛ వుండొచ్చు. అతని దగ్గర బోలెడు తబలాలుండొచ్చు. కాని వాయిం చడం రాకపోవచ్చు. వాయించడంవస్తే టైము లేకపోవచ్చు.

నలుపు కొందరికిష్టం. తెలుపు యిష్టం యింకొందరికి. మరి కొంతమందికి అమెరికన్లంటే ఇష్టం. ఇంకా కొంతమందికి నీగ్రోలంటే ఇష్టం. అధమం నీగ్రోలకి, కొందరికి గాంధీగారిలాగా గావంచా కట్టుకొని, ఆశయాల కోసం జీవించి, మర్డరైపోయి, చరిత్రలో శాశ్వత ముద్ర వేసుకోవాలని వుంటే యింకొదరికి హిరణ్యకశిపుడిలాగో, హిట్లర్లాగో ప్రపంచాన్నంతా జయించి ప్రజల నెత్తురు తాగడం ఇష్టం.

భారతం కొందరిష్టపడితే, బూతు పుస్తకాలంటే కొందరు ప్రాణం ఇచ్చేస్తారు. పంచతంత్రం కొందరు పారాయణం చేస్తే పెర్రీమేసను కొందరు యిష్టపడతారు. ఒకరికి నాగేశ్వరరావు, మరొకరికి నాగేస్. ఒకరికి సావిత్రి. ఇంకొకరికి సయిరాబాను, కొందరికి కామెడీలు, కొందరికి ట్రాజెడీలు.

ఆఖరివి యిష్టమైనవారిలో, ఇంగ్లండులో చదువుకొని స్విట్జ ర్లాండులో స్కేటింగు నేర్చుకొని, పందొమ్మిదో ఏటే పట్టభద్రు రాలైన మల్టీమిలియనేర్ మధుసూదనరావు గారిఏకైక పుత్రిక రాధని చెప్పుకోవచ్చు. ఆవిడకి ట్రాజడీ అంటే వెర్రి యిష్టం.

అసలావిడ పుట్టుకే మంచి గమ్మత్తైన సినిమాటిక్ ట్రాజెడీ అట. ఆవిడ తల్లి లలితమ్మ నెలలు నిండగనే పురిటికి పుట్టింటికి వెళ్తోందిట. సగం తోవలో అనుకోకుండా పెద్ద గాలి, వాన వచ్చాయట. అలాంటి భయంకర వాతావరణం అలవాటు లేని లలితమ్మ అలవాటు ప్రకారం మూర్ఛపోగా, ఆ కార్లోనే రాధ పుట్టిందిట. ఇదంతా తరుచు లలితమ్మ రాధతో వర్ణించి చెప్పి నప్పుడు ఎంత ట్రాజికల్ బర్త్ నాది అని రాధ కళ్ళు సంతోషంతో మెరుస్తాయి.

రాధ తన ఎయిర్ కండిషన్డు గదిలో కూర్చొని ఎప్పుడూ బీదలపాట్లూ, అనాధల ఆర్తనాధాలు, ఆకలి అరుపులూ గల పుస్తకాలే చదువుతుంది. ఏరో ప్లేనులాంటి కార్లో వెళ్ళి బీదవాళ్ళ పిల్లలకి చాక్‌లెట్లు, క్రీమ్ బిస్కట్లు పంచని రోజుండదు. ఎయిర్ కండిషన్డు థియేటర్లో ఆమె ఎప్పుడూ ఇటలీ పేదవారిసినిమాలూ, ఫ్రెంచి విప్లవానికి ముందు వారి పేద ప్రజల పాట్లూ చూస్తుంది. ఆమె గదిలో వ్రేలాడు తున్న నిలువుసైజు తైలవర్ణ చిత్రం "భిక్షుకి" ఆమె ఈ మధ్య సమ్మర్‌కి బెంగుళూరు వెళ్ళినప్పుడు అక్కడ ఎగ్జిబిషన్‌లో మూడువేలకి కొంది.

అసలావిడకి గొప్పవాళ్లంటే అసహ్యం. పేదవాళ్ళే ఆమె ప్రాణ స్నేహితులు. ఆమె ఎందరో బీద విద్యార్థులకి జీతాలు కట్టి, పుస్తకాలు కొంది. వాళ్ళ మమ్మీ కొన్న టెర్లిన్ చీరలు, బెనారసు బ్లౌజులు సగం పైగా యింకా కొత్త మాయకుండానే అడుక్కునే వాళ్ళకీ, అనాథ శరణాలయాల్లో ఆడపిల్లలకీ యిచ్చేస్తుంది.

ఆమెకు మామూలు మనిషి కోరుకొనేవీ, కోరుకోలేనివీ అన్నీ వున్నాయి. ఒక్క పరీక్ష కూడా తప్పలేదు. అర ఔన్సు మందు ఒక్కనాడూ తాగలేదు. వాళ్ళడాడీ తిట్టలేదు. వాళ్ళ మమ్మీ కసరడం కూడా చెయ్యదు. పోనీ తల్లిలేని పిల్లగానైనా కనీసం బాధపడడానికి వీల్లేకుండా పోయింది. అప్పుడే పోతపోసిన కంచువిగ్రహం లాంటి తల్లి వుండబట్టి డబ్బు అవసరాలకి సరిపోదేమో బాద పడదాం అంటే ఆమె అడక్కుండానే అడగ దల్చుకున్న దానికి రెట్టింపు యిస్తారు వాళ్ళ డాడీ.

ఆమెకున్న ఒక్క కష్టమూ తనకి మనిషి కుండవలసిన కనీ సపు కష్టాలన్నా లేవే అన్న బాధే. ఆ బాధ ఆవిడ నరనరాన్నీ పీల్చివేస్తోంది. క్రిష్టియన్లలో కలిపిసోయి, ఏ ఆఫ్రికాలోనో, ఏ కుష్టు వారికో సేవ చేద్దామా? అనుకునేది. ఓసారి, మరోసారి తనో పెద్ద రచయిత్రి అయిపోయి ఆకలి అరుపులతో, పేదల పిలుపులతో, కారే కన్నీళ్ళతో కలవారి మనసుల్ని మార్చేద్దామను కునేది. మరోసారి పెద్ద ఫ్యాక్టరీ పెట్టి, అందులో పన్చేసే కూలా

ళ్ళందరికీ తలో వాటా యిచ్చే ద్దామనుకునేది. ఇంకోనాడు తమ కారు బీద డ్రైవర్ని పెళ్ళాడేసి, వాడికి చదువూ,సంస్కారమూ మప్పి, వాణ్ణో పెద్ద సినిమా హీరో చెయ్యాలని అనుకొని వాడికి దవరకే యిద్దరు పెళ్ళాలు. ముగ్గురు ముండలు వున్నారని తెలుసుకొని ఆ ప్రయత్నం మానేసింది. ఆఖరికి ఏ కులం తక్కువ వాడినో ప్రేమించి, భగ్న హృదయగా, భారంగా వీణ మీటుతూ తన శేషజీవితం ఏకాశీలోనో గడుపుదామను కొంది. కాని ఆమెని తక్కువ కులం వాడు కాని, ఎక్కువ కులం వాడు కాని ఎప్పుడూ ఆకర్షించలేదు.

"ఇంక నా జీవితానికి కష్టాలు రాయలేదు కాబోలు భగవంతుడు" అని ఆమె విచారిస్తున్న సమయంలో యింక "నా కష్టాలకేం కొదువలేదు" అనుకుంది ప్రథమంగా డాక్టర్రామనాథం గారిని చూసినప్పుడు.

అతనికీ ట్రాజెడీలంటేనే ఇష్టం. అయితే భగవంతుడికి అతనంటే యింకా ఇష్టం. అందుచేత భగవంతుడు అతని పట్ల నిత్యం తన్నే సవత్తల్లిని అతి చిన్నతనంలోనే యిచ్చి, అతను కాస్త పెద్దయ్యేలోగానే, అదే కరుణతో అదే భగవంతుడు తనకున్న రెండెకరాలూ రెండో భార్య పేర రాయించేసి అతని తండ్రిని తీసుకొని పోయేడు. ఇంక ఆ తర్వాత రామనాథరావు ఒకరింట్లో తిని, మరొకరి అరుగు మీద పడుకొని, పక్కవాడి పుస్తకాలు చదివి పరీక్షలు పాసై, ఎమ్మెస్ చదువుతున్నారు.

ఎన్ని కష్టాలతనికి! అని అసూయ పడింది రాధ.

డాక్టర్రామనాథరావు అందగాడు. అహంకారి కాడు. రంగులో రాధకన్నా తెలుపైనా వర్ణంలో రాధకన్నా రెండు మూడు మెట్లు తక్కువ. పొడవులో ఆమె కంటే రెండుమూడగులు ఎక్కువున్నా, ఆస్థిలో పది పన్నెండు లక్షలు పొట్టివాడు. రాధ ఆస్థికన్నా కనీసం పన్నెండు లక్షలుంటుంది.

"అన్ని విధాలా నాకు తగినవాడు" అనుకోసాగింది రాధ. అతన్తో పరిచయం పెరుగుతున్న కొద్దీ, ఎంత ముదిరినా ఏమీ అనుకుంటున్నట్టు లేదు రామనాథరావు.

❖ ❖ ❖

ఏటొడ్డున యిసుకలో సరుగుడుతోట దగ్గర రాధా, రామనాథరావూ కూర్చున్నారు. పన్నీరులా ప్రవహిస్తోంది పక్కనున్న సెలయేరు. సెలయేటి సంగీతానికి సన్నగా ఆలాపిస్తున్నాయి సరుగుడు చెట్లు. దేవతలు రాసక్రీడ లాడుకుంటున్నట్లు ఎర్రబడింది ఆకాశం. చెట్టుమీద పిట్టల జంట ఒకటి క్రింద నున్న జంటను చూసి గుసగుస లాడుతున్నాయి.

"ఎంత బావున్నారో వీళ్లు" మీటింది జవరాలు.

"ఆవిడకి అతనంటే ప్రాణం, మొగపిట్ట ముదలకింపు.

"మరే అతనికి మాత్రం పాపం పైకి చెప్పాలంటే భయం"

వాటి సంభాషణ యిలా వూహించుకుంటున్న రాధ, పూర్వ రాకుమరులకి పక్షిభాష వచ్చేదట. నేను కూడా ఆ రాకుమారుడినైతే ఎంత బావుణ్ణు! అన్నరామనాథరావు మాటకి ఉలిక్కిపడింది. ఆ మాటల అంతరార్థం అవగతం కాగానే ఆవిడ శరీరం సిగ్గుతో జలదరించింది.

❖ ❖ ❖

తన ప్రణయం, రామనాథరావుని పెళ్ళాడదలచిన వైనం. రాధ తల్లితో చెప్పింది.

"ఛీ! సిగ్గుమాలినదానా! నాతో ఈ మాట చెప్పడానికి నీకు నోరెలా వచ్చిందీ? కులం తక్కువ వెధవనీ, అణాకానీకి ఠికానా లేక అరుగుమీద చదువుకున్న అప్రాచ్యుణ్ణీ చేసు కుంటానన దానికి అసలు నీకు బుద్దెలా లేకపోయింది? అసలు నిన్నని ఏం లాభం నిన్ను పెద్ద చదువులు చదివించి, మగాడిలా పెంచిన మీ నాన్నని అనాలి. ఇంటా వంటా ఏనాడైన ఎరుగుదుమా యిలాంటి అపభ్రంశపు పనులు? మా వంశంలో చెడపుట్టేవు నువ్వు. ఏం చూసి వరించేవు తల్లీ వాడినీ? అందం వుంటే చాలనుకున్నావేమో. అనక అడుక్కోవడానిక్కూడా అర్హత వుండదు నీకు. ఛీ, ఛీ ఇవాళ నుండి నీకు నేను అమ్మను కాను, నాకు నువ్వు కూతురివి కావు. అసలు నాకు పిల్లలే పుట్టలేదనుకుంటాను. ఫో, నా ఎదుటనుండి" అని తల్లి అంటుందని ఆశించిన రాధకి, "నీ యిష్టం కాదన్నదెప్పుడు తల్లీ, నీ యిష్టమే మా సంతోసం. పోయి మీ నాన్నని కూడా అడుగు" అన్న లలితమ్మ మాటలకి మతిపోయి నట్లయింది.

ఆ రాత్రి డ్రాయింగ్ రూంలో గోడల గులాబీరంగు ట్యూబు లైట్ల కాంతిలో వెలిసినట్టుగా కనిపిస్తోంది. సంతర్పణలో దిక్కుమాలినవాళ్ళ గోలలా వుంది బైట వర్షం రొద. మూసిన కిటికీ తలుపు సందుల్లోంచి బుస కొడ్తున్న నాగులా ప్రవేశిస్తోంది ఈదురు గాలి. బయటి వాతారణమంతా రాధ మనస్సులగే భీభత్సంగా వుంది.

ఆరో పెగ్గు వేసుకుంటున్న మధుసూధనరావు గారి కళ్ళు, బైట మెరుపు కాంతితో ఆకలితో వున్న పులి కళ్ళలా ఎర్రగా మెరుస్తున్నాయి.

మాటలు తూస్తూ, నెమ్మదిగా, బరువుగా, అంతా వివరించిన తరువాత రాధ, "అతనికీ యిష్టమే, మీ అంగీకారం, ఆశీర్వాదాలు కావాలిడాడీ" అని దేవుడిలా వున్నా రాయీ, రాతిలో వున్న దేవుడూ కరిగేలా ప్రార్థించింది అతన్ని.

మిలియనేర్ మధుసూధరనావుగారి కళ్లు ఇంకెంచె ఎరుపెక్కేయి. వాట్ (VAT) 60 బాటిలు ఎంతో మెజిస్టిక్‌గా పట్టుకొని, ఎడమ చేతిలోని గ్లాసులో ఏడో పెగ్గు పోసుకుంటూ వుంటే తొలిసారి అతని చెయ్యి వణికింది. అతను రాధ వేపు సూటిగా చూస్తూ సిప్ చేసిన గ్లాసు టేబిలు మీద పెట్టేసి, సో నువ్వా కుర్ర డాక్టర్ని పెళ్ళాడతానంటావ్. అవునా, కమాన్. లెటజ్ టాక్ ఫ్రాంక్లీ. నీ వయస్సెంత? మహా వుంటే యిరవై, ఇంక నువ్వు చూసిన ప్రపంచం ఎంత స్విట్జర్లాండులో ఐసుగుట్టలు, లండన్లోని స్కూలు బిల్డింగు, మనిల్లు, అంతేనా, ఇంక మనుకున్న ఆస్థి ఏ మాత్రం వుంటుందోనువ్వు అంచనా వెయ్యగలవా? పన్నెండు లక్షల పైనే అని నా జ్ఞాపకం. రామనాథం డాక్టరై నెలకెంత తేగలడు? అయితే ఆరువందలు, కాకపోతే వెయ్యిలోపు. "నా ఆస్థి అతనిది కాదా?" అనడగుదామని నీకుంది. ఈ కాలంలో ఎవరి ఖర్మ వాడిది. ఎవడి పాపం వాడిది. అలాగే ఎవడి డబ్బు వాడిదే. మొగుడు పెళ్ళానికిస్తున్నాడా? తల్లి పిల్లలకి పెడుతోందా?

చీపురుకట్టతో తుడుచుకుంటాం గాని, ఫ్లవర్ వాజులో పెడతామా? పెట్టం. గొప్పవాడు కొన్నిపరిస్థితుల్లో బీదవా డౌతాడేమో గాని బీదవాడు ఏ పరిస్థితుల్లోను గొప్పవాడు కాడు. కాలేడు. ఇంకకులం అంటావా? డబ్బుతోనే కులం కూడా వస్తుంది. డబ్బులేక పోతే వున్న కులం కూడా పోతుంది. ఇదీ ఇప్పటి పరిస్థితి. అంటూ సిప్ చెయ్యడం కోసం ఓ క్షణం ఆగేరు.

అతని మాటలు వింటున్న రాధకి తన కింద భూమి పగిలి తను సీతాదేవిలా భూమిలోకి దిగిపోతున్నట్టూ, తన బంగళా గోడల పగిలి తను సజీవ సమాధి అయిపోతున్నట్టు అన్పించింది.

"కాబట్టి నువ్వు తీసుకున్న నిర్ణయానికి నిన్ను అభినందిస్తున్నాను. నిన్ను చూసి గర్వపడుతున్నాను. విష్ యు గుడ్ లక్" అంటూ ముగించేరు.

అప్పుడు కూడా అతని మాటలు విన్న రాధకి తన పాదాల కింద భూమి పగిలిపోతున్నట్లు, తన బంగళా గోడలు కూలిపోతున్నట్టు అన్పించింది.

"కాశీలో శేష జీవితం భగ్న ప్రేమికురాలిగా గడుపుదామన్న ఒక్క కోరికా కూడా తీరలేదు" అని కుమిలి పోయింది.

**(ప్రతిభ వారం, 3.5.1968)**

# అసలు లేని వడ్డీ

"వాడి పాత అప్పు యీ జన్మలో తీర్చను. ప్రతి ఫస్టుకీ వడ్డీ వాడి మొహాన్ని కొట్టేస్తున్నాను వాడిక్కావలసింది వడ్డీ మనక్కావలసింది అసలు"

పెళ్ళి కూతురి మొగలి జడలా మెరిసిపోతోంది పంటకాలువ.

అందులో విరిసిన వెండిపువ్వులా వెలిగిపోతున్నాడు చంద్రుడు.

అద్దాల్లో పిల్లకి పాలిస్తున్న చల్లని తల్లిలా వున్నది పల్లాన వున్న గున్నమామిడి.

దూరాన పైటలా ఎగురుతున్న తెరచాపకు స్వాగతం పాడుతోంది అవలిగట్టు సరుగుడుతోట.

ఎప్పుడూ ఇలా ఉండిపోతే బాగుండునన్నట్టుంది ప్రకృతి.

కాని దారితప్పిన పిట్టలా మూలిగేడు కాలివంతెన మీద నున్న విశ్వనాథం. అతనికిమటుకు, ప్రకృతి, పచ్చగడ్డిలో పడుకొని ఆకాశంలోని చుక్కల్ని చూస్తూ పకపకనవ్వే పడుచులా వున్నా ఒకటే–మెట్టపొలంలోని కిందటేడు దిష్టి బొమ్మలా ఉన్నా ఒకటే. పరిసరాలకు అతని మీద ప్రభావం పోయి ఎన్నేళ్ళయిందో అతనికే గుర్తులేదు.

నేనూ ఒక మనిషినే. నాకు మనిషిగా బతికే హక్కూ నవ్వే అర్హతా ఉన్నాయి. అయినా సంసారపు రాతి పర్వతం క్రింద పడి, నేనూ ఒక మనిషినే అన్న అంశమే మర్చిపోయే దీనస్థితికి ఎందుకు దిగజారిపోయేను? ఏడుపు ఒక్కటేనా ప్రభూ, నువ్వు మాకిచ్చే మానవానుభవం అని ఆలోచించే మానసిక శక్తి కూడా లేకపోయింది అతనికి.

చింకిగా, బరువుగా అయిపోయిన పాత ఖద్దరు కోటులో – వాసనపోయిన అత్తరు మరకలా కనిపిస్తుంది జీవితం అతనికి.